క్లుప్తంగా...

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: విద్యుత్ సబంధ మరమ్మతు పనుల కారణంగా బేగంపేట, గ్రీన్‌ల్యాండ్స్, జన ప్రియా సబ్‌స్టేషన్ల పరిధిలో బుధవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గ్రీన్‌ల్యాండ్స్ ఏడీఈ కిషోర్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రశాంత్‌కాలనీ, బల్కంపేట్, బీకేగూడ మసీదు, ఈఎస్ఐ స్టాఫ్ క్వార్టర్స్, భరత్‌నగర్ కాలనీ, మహేశ్వరినగర్ కాలనీ, శక్తినగర్, ఎల్ఐజీ, ఈడబ్ల్యూఎస్, ఎంఐజీ, హెచ్ఐజీ క్వార్టర్స్, ఎస్పీ నగలలో విద్యుత్ ఉండదన్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అపోలో హాస్పిటల్ ఎదురు ప్రాంతం, లాల్‌బంగ్లా, ఏరియా, డాక్టర్ రెడ్డీస్ లేబరేటరీస్, అపరాజిత కాలనీ, సాదైత్ మంజిల్, ఎంసీహెచ్ మార్కెట్, ఎస్ఆర్‌టీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని ఏడీఈ వివరించారు.

వృద్ధుడిని చేరదీసిన హెల్పేజ్ ఇండియా సంస్థ



లాలాపేట: ఎవరూ లేని ఓ వృద్ధుడిని హెల్పేజ్ ఇండియా సంస్థ ప్రతినిధులు ఓయూ పోలీసుల సహకారంతో చేరదీసిన సంఘటన మంగళవారం ఓయూ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలివీ... అలహాబాద్‌కు చెందిన అక్బర్(65) ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలో ఫుట్‌పాత్‌పై ఉంటున్నాడు. ఇది గమనించిన ఓ విద్యార్థి హెల్పేజ్ ఇండియా సంస్థకు సమాచారం అందించారు. దీంతో ఆ సంస్థ ప్రతినిధి ఎం. సురేష్ సంఘటన స్థలానికి చేరుకుని ఓయూ పోలీసుల సహకారంతో హెల్పేజ్ ఇండియా సంస్థలో చేర్పించారు. పూర్తి వివరాల కోసం 18001801253 హెల్ప్ లైన్ నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ముగిసిన జాతీయ సదస్సు



మాట్లాడుతున్న ఆచార్య సుధ

పద్మారావునగర్: సికింద్రాబాద్ పద్మారావునగర్ సర్దార్ పటేల్ కాలేజీలో 'వినూత్న వ్యూహాలు వ్యవస్థాపకత వ్యాపార నిర్వాహణ' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సు మంగళవారం ముగిసింది. సదస్సులో ఆచార్య సుధా మాట్లాడుతూ... వ్యాపార రంగంలో మార్కెటింగ్ పరంగా అనేక సమస్యలు, సవాళ్లు ఉంటాయన్నారు. వీటిని ఎంతో చాకచక్యం ఎదుర్కోవాలని సూచించారు. టాటా బిజినెస్ సపోర్ట్ సంస్థ ఉపాధ్యక్షులు వి.ఎస్. విజయ్‌చంద్ మాట్లాడుతూ... నిర్దిష్టమైన కార్యచరణ, సమర్థవంతమైన నాయకత్వ పటిమతో వ్యాపారంలో రాణించగలమన్నారు. వ్యాపార రంగంలో అనేక సమస్యలు, సాధక బాధలను ఎంతో నైపుణ్యంతో ఎదుర్కోవాలని సూచించారు. కళాశాల కార్యదర్శి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ... సర్దార్ పటేల్ కాలేజీ అత్యుత్తమైన విద్యా ప్రమాణాలతో విద్యార్థుల జీవితాలను తీర్చిదిద్దుతున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత, వైస్ ప్రిన్సిపాల్ అమర్‌నాథ్ శర్మ, సదస్సు కన్వీనగర్ ఇంద్రసేనారెడ్డి, వివిధ కళాశాలల ఎంబీఏ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు.

తల్లి మందలించిందని కుమార్తె ఆత్మహత్య

అడ్డగుట్ట: తల్లి మందలించిందని మనస్థాపానికి గురైన ఓ యువతి రైలు కింద పడి నాత్మహత్య చేసుకుంది. సికింద్రాబాద్ జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం... కృష్ణా జిల్లా పెడన్ బ్రహ్మపురం ప్రాంతానికి చెందిన అల్లం పాండురంగ, శ్యామల దంపతులు. గత 20 ఏళ్లుగా ఘట్‌కేసర్ అంకుశపూర్‌లో నివాసం ఉంటున్నారు. కుమార్తె నాగ భవాని(18) కుమారుడు సంతానం. భవాని పీర్జాదిగూడలోని స్టోర్‌లో పని చేస్తుంది. ప్రతినెల ఆమెకు వచ్చిన జీతం డబ్బులను ఇంట్లో ఇచ్చేది. అయితే ఈ నెలలో జీతం డబ్బులు ఇంట్లో ఇవ్వకపోవడంతో తల్లి అడిగితే ఖర్చు అయ్యిందని చెప్పింది. ఈ విషయంలో సోమవారం తల్లి మందలించింది. అదే రాత్రి అందరూ భోజనం చేసి నిద్రపోయిన తర్వాత ఇంటి నుంచి వెళ్లిపోయిన భవాని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. రాత్రి 11 గంటల సమయంలో నిద్రలేచిన తల్లి కుమార్తె కనిపించక పోవడంతో ఆమె కోసం వెతుకుతున్నారు. రాత్రి 2 గంటలకు ఘట్‌కేసర్ చర్లపల్లి రైల్వే స్టేషన్ మధ్య రైలు పట్టాలపై ఓ యువతి మృతదేహం ఉన్నట్లు గుర్తించిన రైల్వే స్టేషన్ అధికారులు జీఆర్‌పీ పోలీసులకు సమాచారం అందించారు. జీఆర్పీ ఎస్ఐ మజీద్ ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఉదయం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కి వచ్చిన మృతిరాలి తల్లిదండ్రుల ద్వారా భవానీగా గుర్తించారు.

కూరగాయల ధరలు

సనత్‌నగర్: ఎర్రగడ్డ రైతుబజార్‌లో వివిధ కూరగాయల ధరలు ఈ విధంగా ఉన్నాయి. టమాట కిలో రూ. 67, నల్లవంకాయ 28, పొడుగు వంకాయ 28, బెండకాయ 45, పచ్చిమిర్చి 95, బజ్జీమిర్చి 80, క్యాప్సికమ్ 75, పచ్చ కాకర 45, పందిరి బీర 40, క్యాబేజీ 13, క్యారెట్ 45, దొండ 19, గుండుబీన్స్ 95.

వెండర్ జోన్.. డబ్బాలతో పరేషాన్!

చిరువ్యాపారుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన వెండర్ జోన్ లక్ష్యం పక్కదారి పడుతోంది. అన్ని రకాల నిత్యావసర వస్తువులన్నీ ఒకేచోట అందించి ఒకవైపు కొనుగోలుదారులకు మేలు చేకూర్చడంతో పాటు మరోవైపు చిరువ్యాపారులకు ఉపాధి కల్పించే ఉద్దేశంతో వెండర్ జోన్ ప్రతిపాదన తీసుకువచ్చారు.

- స్టాల్స్ ఎదుట ఇష్టారాజ్యంగా డబ్బాల ఏర్పాటు
- వాహనదారులు, పాదచారుల రాకపోకలకు అంతరాయం
- ప్రమాదాలు జరిగేందుకు అవకాశం ఉందంటూ సర్వత్రా ఆందోళన



సనత్‌నగర్ ప్రధాన రహదారిలో వెండర్ జోన్‌లోని స్టాల్స్ ఎదుట ఏర్పాటు చేసిన డబ్బాలు

సనత్‌నగర్: సనత్‌నగర్ ఇండస్ట్రియల్ పార్కుకు ఆనుకుని ప్రధాన రహదారిలో 18 స్టాల్స్, బల్కంపేట ప్రధాన రహదారిలో ఆర్ అండ్ బీ కార్యాలయ ప్రహరీని ఆనుకుని మరో 15 వరకు స్టాల్స్‌ను అత్యంత సుందరంగా తీర్చిదిద్దారు. ఆ జోన్‌ను ఇటీవల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రారంభించారు.

- అయితే తమకు కేటాయించిన స్టాల్స్‌లో వ్యాపారం చేసుకునేందుకు చాలామంది చిరువ్యాపారులు ఇంకా ముందుకురాలేదు. ఈ లోగానే కొంతమంది ఎలాంటి అనుమతులు లేకుండా స్టాల్స్ ముందు డబ్బాలను ఏర్పాటు చేయడం ద్వారా కొత్త సమస్యలు తలెత్తుతున్నాయి.
- లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన షెడ్లలో తమ వ్యాపారాలు చేసుకోకుండా ఫుట్‌పాత్‌పై డబ్బాలను ఏర్పాటు చేయడంతో అసలు వెండర్ జోన్ లక్ష్యం నీరుగారిపోతోంది.
- జీహెచ్ఎంసీ నిర్మించిన స్టాల్స్‌ను వదిలేసి ఇప్పటికే ఎవరికి తోచిన రీతిలో వారు తమ స్టాల్స్ ముందు చాట్‌భండార్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, టీ స్టాల్స్ డబ్బాలను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఆయా డబ్బాల వద్దకు వచ్చే కొనుగోలుదారులు తమ వాహనాలతో పాటు తాము సైతం రోడ్డు మీదనే కూర్చోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి.
- వీటికి తోడు ఉదయం టిఫిన్ సెంటర్, మధ్యాహ్నం భోజనం సెంటర్లు ఇక్కడ రోడ్డు మీదనే వెలుస్తుండడంతో ఆ మార్గంలో వెళ్లేవారికి ఇక్కట్లు తప్పడం లేదు.
- ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు స్టాల్స్ పొడవునా మరిన్ని డబ్బాలను ఏర్పాటుచేసి ప్రధాన రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడే ప్రమాదం లేకపోలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- ఇదిలా ఉంటే సనత్‌నగర్ ప్రధాన రహదారి 100 ఫీట్ల రోడ్డు కాగా ఎస్ఆర్‌టీ కాలనీ వైపుతో పోలిస్తే స్టాల్స్ ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ పార్కు వైపు మాత్రం రహదారి తక్కువ వెడల్పు ఉంటుంది. స్టాల్స్, వాటి ముందు ఫుట్‌పాత్ నిర్మాణం పోను 15 అడుగులు కూడా ఉండని పరిస్థితి ఇక్కడ నెలకొంది.
- ఇప్పటికే ఈ మార్గంలో రద్దీకి తోడు ఎవరికి వారు తమ వ్యాపారాలను రోడ్డు మీదనే విస్తరించుకుంటూ వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.
- ఇటీవల నిర్మించిన రోడ్డు డివైడర్ కూడా ఒక పద్ధతి ప్రకారం నిర్మించకపోవడంతో పాటు స్టాల్స్‌ను వదిలేసి డబ్బాలను ఇబ్బడిముబ్బడిగా ఏర్పాటుచేస్తుండడంతో ఈ మార్గంలో ప్రమాదాలు పొంచి ఉన్నాయి.
- ఇకనైనా సంబంధిత అధికారులు ఒక నిర్దిష్టమైన విధానాన్ని రూపొందించి ఆ మేరకు వెండర్ జోన్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నిర్మించి ఇచ్చే వరకే: జీహెచ్ఎంసీ డీఈఈ యతీంద్ర మోహన్

వెండర్ జోన్‌ను నిర్మించి ప్రారంభించే వరకే జీహెచ్ఎంసీ పని అని డీఈఈ యతీంద్ర మోహన్ వెల్లడించారు. ఎవరికి అలాట్ చేస్తారు.. వాటి నిర్వహణ తమకు సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. స్టాల్స్ ముందు ఏర్పాటు చేసిన డబ్బాల విషయం మా పరిధి కాదని పేర్కొన్నారు.

వార్డు కార్యాలయాల్లో సేవలపై...ప్రజలకు అవగాహన కల్పించాలి

డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీలత

లాలాపేట: జీహెచ్ఎంసీ పరిధిలో ఇటీవల అందుబాటులోకి వచ్చిన వార్డు కార్యాలయాల్లో లభించే సేవలపై ప్రజల్లో అవగాహన కల్పించాలనీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ మేరకు వార్డు కార్యాలయాల్లో ఫిర్యాదు రిజిస్ట్రేషన్ పద్ధతులు, అక్కడ అందించే శాఖల వివరాలు తదితర అంశాలతో రూపొందించిన కరపత్రాన్ని మంగళవారం తార్నాకలోని తన కార్యాలయంలో డిప్యూటీ మేయర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఈ కరపత్రాలను ప్రతి ఇంటికి చేరేలా చేయాలన్నారు. తద్వారా వార్డు కార్యాలయాల సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. 8 విభాగాలకు చెందిన అధికారులు వార్డు కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఫిర్యాదుల కోసం ఫోన్: 90104 02909లో సంప్రదించవచ్చన్నారు. ఇంజినీరింగ్ డీఈ సువర్ణ, ఏఈ వెంకటేష్, వర్క్ ఇన్స్‌పెక్టర్ మిస్బా, సానిటేషన్ సూపర్‌వైజర్ యాదగిరి పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి



ఆందోళన చేస్తున్న విద్యార్థులు

లాలాపేట: ఇంటిగ్రేటెడ్ 5 సంవత్సరాల కెమిస్ట్రీ కోర్సు రద్దు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ మంగళవారం ఓయూ పాలనా భవనం ఎదుట విద్యార్థులు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ... ఇదే అంశంపై గత 4 నెలల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దారుణం అన్నారు. ఒక వైపు విద్యా శాఖా మంత్రి, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఈ ఇంటిగ్రేటెడ్ కోర్సు వల్ల చాలా ఉపయోగాలున్నాయని చెప్తున్నారని , మరో వైపు ఓయూ వైస్ చాన్సలర్ ఈ కోర్సు రద్దుకు వివిధ ప్రయత్నాలు చేస్తున్నారని విద్యార్థులు ఆరోపిస్తున్నారు. దీని కోసం ఓయూ వీసిని కలువడానికి వచ్చిన విద్యార్థులను వీసి కలువడానికి అనుమతి ఇవ్వకపోవడంతో చేసేదేమి లేక పాలనా భవన్ గేటు వద్ద విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా అధికారులు స్పందించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు.

211 ఆలయాలు.. రూ. 56.13 లక్షలు

- కంటోన్మెంట్‌లో బోనాల చెక్కుల పంపిణీ
- సంక్షేమంలో దేశానికే తెలంగాణ ఆదర్శం
- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



బోనాల చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

కంటోన్మెంట్: బోనాల ఉత్సవాలను ప్రజలు సంతోషంగా, గొప్పగా జరుపుకోవాలనే ఆలోచనతోనే దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రైవేట్ దేవాలయాలకు కూడా ఆర్థిక సహాయం అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని 211 దేవాలయాలకు మంజూరైన రూ. 56.13 లక్షల విలువైన చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఆధ్వర్యంలోనే ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. బోనాల ఉత్సవాల విశిష్టతను తెలంగాణా ప్రభుత్వం మరింత పెంచిందని చెప్పారు. మన సంస్కృతికి ప్రతీకగా నిలిచే బోనాల ఉత్సవాలు దేశ విదేశాలలో ఎంతో గొప్పగా జరుపుకొంటున్నారని, ఇది మనకెంతో గర్వకారణం అన్నారు. ప్రజలు సంతోషంగా ఉండాలి, పండుగలను గొప్పగా జరుపుకోవాలనేది ప్రభుత్వ ఆలోచన అన్నారు. ఈ కార్యక్రమంలో బెవరేజేస్ కార్పోరేషన్ చైర్మన్ గజ్జెల నగేష్, దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణ, అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ, మాజీ కార్పొరేటర్ లాస్య నందిత, సుబ్రమణ్య స్వామి ఆలయ చైర్మన్ సంతోష్ యాదవ్, టి.ఎస్.శ్రీనివాస్, పనస సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు



కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావుకు సమస్యను విన్నవిస్తున్న బేగంపేట చీకోటి గార్డెన్స్‌ప్రాంత ప్రజలు

సనత్‌నగర్: ఎలాంటి సమస్య అయినా పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు స్పష్టం చేశారు. జీహెచ్ఎంసీ, వాటర్‌వర్క్స్ తదితర విభాగాలకు చెందిన అధికారులతో బేగంపేట డివిజన్ పరిధిలోని చీకోటి గార్డెన్స్ పరిసర ప్రాంతాల్లో మంగళవారం ఆయన పాదయాత్ర చేసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా ఈ ప్రాంతం లోతట్టు ప్రాంతం కావడంతో వరదనీరు చేరి ముంపునకు గురవుతుండటంతో పాటు తరచూ డ్రైనేజీ సమస్యలు తలెత్తుతున్నాయని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ లోతట్టు ప్రాంతంలో ఉన్నందున భారీగా వచ్చే వరదనీటిని ఎప్పటికప్పుడు మోటార్ల ద్వారా తరలించే ఏర్పాట్లు చేయాలన్నారు. వరద నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు సాఫీగా వెళ్లేలా నూతన డ్రైనేజీ నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బేగంపేట డివిజన్‌లో ఏ సమస్య తీసుకున్నా శాశ్వతంగా పరిష్కారం జరిగేలా చూశామని పేర్కొన్నారు. శ్యాంలాల్ బిల్డింగ్‌లో ధనియాలగుట్ట శ్మశానవాటికను అన్ని హంగులతో అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. బేగంపేట ప్రధాన నాలా అభివృద్ధికి రూ.45 కోట్లు మంజూరు చేసి అభివృద్ధి పనులను చేపట్టినట్లు చెప్పారు. దీని ద్వారా నాలా పరీవాహక ప్రాంత ప్రజల ముంపు సమస్య తొలగనున్నదన్నారు. కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, నాయకులు సురేష్‌యాదవ్, రాజయ్య, నరేష్, సత్యనారాయణ, డీఎంసీ ముకుందరెడ్డి, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ డీజీఎం శశాంక్ తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ ఆలయ అభివృద్ధికి కృషి



సాయిబాబాను సత్కరిస్తున్న ఆలయ ప్రతినిధులు

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మహ్మద్‌గూడలోని ముత్యాలమ్మ, నల్లపోచమ్మ ఆలయ అభివృద్ధికి తనవంతు ఆర్థికసాయం అందిస్తానని నాగులూరి నర్సింహా వెల్ఫేర్ అసోషియేషన్ అధ్యక్షుడు, సాయిబాబా సమేత బాలాంజనేయ స్వామి ఆలయ ఫౌండర్ ట్రస్టీ నాగులూరి సాయిబాబా హామీ ఇచ్చారు. బస్తీవాసుల అభ్యర్థన మేరకు మంగళవారం ముత్యాలమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వహణ లోపంతో పురాతనమైన ముత్యాలమ్మ ఆలయం శిథిలావస్థకు చేరుకుందని బస్తీవాసులు, పలువురు భక్తులు ఆయన దృష్టికితేగా, ఆలయ నిర్మాణం, అభివృద్ధికి తనవంతు సాయం అందిస్తానని, ఈ నెల 16వ తేదిన జరిగే బోనాల జాతర తర్వాత అభివృద్ధి పనులు ప్రారంభించనున్నట్లు నాగులూరి సాయిబాబా స్పష్టం చేశారు. ఆలయ నిర్వాహకులు, బస్తీవాసులు ఆయనకు పూలమాలలు వేసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రకాశరావు, రవీందర్, రామచందర్, కుమార్, నవీన్, శాంతమ్మ, పోచమ్మ, గంగమ్మ, రేణుకలతోపాటు బస్తీవాసులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధి చేస్తున్న బీజేపీకి పట్టం కట్టండి: రామకృష్ణ



కట్టమైసమ్మ బస్తీవాసులతో మాట్లాడుతున్న రామకృష్ణ

రసూల్‌పురా: ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అభివృద్ధి పనులు ప్రారంభిచామని అభివృద్ధి చేసే బీజేపీకే పట్టం కట్టాలని కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ అన్నారు. మంగళవారం బోర్డు రెండవ వార్డు కట్టమైసమ్మ బస్తీలో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ పనులను రామకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గతంలో కట్టమైసమ్మ నగర్‌లో పర్యటించినప్పుడు శిథిలావస్థకు చేరిన యూజీడీ పైప్‌లైన్ మ్యాన్‌హోల్స్ కారణంగా మురుగునీరు బస్తీలోని రోడ్లపైకి చేరి దుర్వాసన వస్తోందని బస్తీవాసులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. త్వరలో నూతనంగా పైప్‌లైన్ అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీని నేరవేర్చామని చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అభివృద్ధి చేసే బీజేపీ అభ్యర్థికి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు ఇంచార్జి సుష్మిత, వార్డు అధ్యక్షుడు మాదరపు అశోక్, జనార్దన్, చిలుకయ్య, చిట్టిబాబు, సత్యనారాయణ, ప్రభు, ఖదీర్, వెంకట్, జగన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్‌లో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తథ్యం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం తేవడమే లక్ష్యమని మోండా డివిజన్‌కు చెందిన తాటికాయల ఏసురత్నం అన్నారు. ఇంతకాలం బీజేపీలో కొనసాగిన ఆయన మంగళవారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కంటోన్మెంట్‌కు చెందిన పలువురు సీనియర్ నాయకులతో కలిసి ఆయన పొంగులేటిని కలిసారు. నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి నేతలంతా కృషి చేయాలని, త్వరలోనే తాను కూడా కంటోన్మెంట్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. పొంగులేటిని కలిసిన వారిలో పిడమర్తి రవి, ప్యారసాని రామ్ కుమార్, బల్వంత్ రెడ్డి, సంజీవ, రాజేశ్, ఎస్. వెంకటేశ్, అన్నానగర్ మురళి, యాదగిరి, వినోద్, ప్ర మోద్, సిరాజ్, సత్యనారాయణ, సంజీవ్ పాల్గొన్నారు.


జలమండలి కార్యాలయంలో ఘనంగా బోనాలు

చిలకలగూడ: శ్రీనివాసనగర్ జలమండలి కార్యాలయంలో మంగళవారం బోనాల జాతర వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలోని మావురాల ఎల్లమ్మ ఆలయానికి పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా బోనాల జాతర ఘనంగా నిర్వహిస్తామని అధికారులు తెలిపారు. డీజీఎం కృష్ణ, నవ్య, ప్రియాంక, కృష్ణమోహన్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

కార్మికులందరూ లేబర్ కార్డులు తీసుకోవాలి: ఏఐటీయూసీ

అడ్డగుట్ట: కార్మికులందరూ లేబర్ కార్డులను తీసుకోవాలని ఏఐటీయూసీ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కమతం యాదగిరి సూచించారు. భవన నిర్మాణ కార్మిక సంఘం సభ్యత్వ నమో దు కార్యక్రమంలో భాగంగా మంగళవారం తుకారాం గేట్ లేబర్ అడ్డ వద్ద సభ్యత్వ నమోదు నిర్వహించారు. కమతం యాదగిరి మాట్లాడుతూ... భవన నిర్మాణ కార్మికులు లేబర్ కార్డు తీసుకోవడం వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వాటన్నింటినీ కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. నాగరాజు, సభ్యులు పాల్గొన్నారు.

సందడిగా ఫలహారం బండ్ల ఊరేగింపు



చిలకలగూడ: మెట్టుగూడ డివిజన్ బోనాల జాతర సందర్భంగా డప్పుచప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలతో తొట్టెలు, ఫలహారం బళ్ల ఊరేగింపు సందడిగా జరిగింది. గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపులో మాజీ మేయర్ బండ కార్తీక చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సీతాఫల్‌మండి బంగారు మైసమ్మ ఆలయంలో జరిగిన బోనాల వేడుకల్లో కార్పొరేటర్ సామల హేమ, పలువురు మహిళ భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై వినూత్న తరహాలో ఆందోళన




రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న క్రిశాంక్, బీఆర్ఎస్ నాయకులు

రసూల్‌పురా: తెలంగాణ ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న 24 గంటల ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కంటోన్మెంట్‌లో వినూత్న రీతిలో బీఆర్ఎస్ నేతలు నిరసన వ్యక్తం చేశారు. మంగళవారం ఏడవ వార్డు వాంబే గృహాల వద్ద హైటెన్షన్ విద్యుత్ స్తంభానికి రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ క్రిశాంక్ ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ వేలాడదీసి కోడిగుడ్లతో కొట్టారు. ఈ సందర్భంగా క్రిషాంక్ మాట్లాడుతూ... రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు ఇవ్వొద్దని కేవలం మూడు గంటలు ఇస్తా చాలని వ్యాఖ్యానించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతన్నల కరెంటు కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం 24 గంటల పాటు నిరంతరం కరంటు ఇస్తోందన్నారు. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని వెంటనే రైతాంగానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నందు, ఈశ్వర్, సునీత, బి.రాజు, శ్రీను, గణేష్, సాయి, శేఖర్, మోని, రఘు, నాగరాజు, కిట్టు, రాకేష్ చారి పాల్గొన్నారు.

గంజాయిని తరలిస్తున్న ముగ్గురి అరెస్ట్

70 కిలోల గంజాయి స్వాధీనం




వివరాలు వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ నర్సయ్య

అడ్డగుట్ట: అక్రమంగా గంజాయిని తరలిస్తున్న ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకొని వారి నుంచి 70 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాలను మంగళవారం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో రైల్వే డీఎస్పీ నర్సయ్య వెల్లడించారు. వెస్ట్ బెంగాల్‌కు చెందిన అమోయ్ నస్కర్(56), లక్ష్మీబాల నస్కర్(41), ఒడిస్సా రాష్ట్రానికి చెందిన మరియం జానీ(20)లు ఈ నెల 9న ఒడిస్సా రాష్ట్రంలోని మోహన ఫారెస్ట్ ఏరియాలో కొనుగోలు చేసి అక్కడి నుంచి మహారాష్ట్రలోని ముంబాయికి అక్రమంగా 70 కిలోల గంజాయిని తరలిస్తున్నారు. ఏడు బ్యాగులలో 29 గంజాయి ప్యాకెట్లు ప్యాక్ చేసి ఇచ్చాపురం రైల్వే స్టేషన్‌లో అదే రోజు సాయంత్ర 6.30 గంటలకు కోణార్క్ ఎక్స్‌ప్రెస్ ఎక్కారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు నిర్వహించగా, ఎస్–9 కోచ్‌లో అనుమానస్పదంగా ఉన్న 7 బ్యాగులను తనిఖీ చేశారు. అందులో 70 కిలోల గంజాయి గుర్తించారు. అనంతరం , నింధితులు అమోయ్ నస్కర్, లక్ష్మీబాల నస్కర్, మరియం జానీలను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 70 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సమావేశంలో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీను, ఎస్ఐ మాజీద్, ఆర్పీఎఫ్ ఎస్ఐలు ప్రజ్ఞా, వెంకట రెడ్డి, గోవింద నాయుడు, కానిస్టేబుళ్ల హేమలత, భారతి, జ్యోతి సురేష్, కోమల్, లావణ్య పాల్గొన్నారు.

శాకంబరి అలంకరణలో బంగారుమైసమ్మ

అమ్మవారికి సమర్పించే పట్టుచీర మగ్గం పనులు ప్రారంభం





చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని బంగారు మైసమ్మ అమ్మవారు మంగళవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. బోనాల జాతర వేడుకల తోపాటు, అమ్మవారికి సమర్పించనున్న పోచంపల్లి పట్టుచీరను పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మగ్గంపై తయారు చేసే పనులను ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్ లాంఛనంగా ప్రారంభించారు. ఆలయంలో కొలువుదీరిన బంగారు మైసమ్మ అమ్మవారిని పలు రకాల కూరగాయలు, పండ్లుతో అలంకరించి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. మగ్గంపై నేసిన పట్టుచీరను శుక్రవారం అమ్మవారికి సమర్పించనున్నట్లు చైర్మన్ పవన్‌కుమార్ వివరించారు.జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ డిప్యూటీ కమిషనర్ దశరథ్, ఈఈ ఆశాలత, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, వారాసిగూడ ఇన్‌స్పెక్టర్ శంకర్, ఆలయ ప్రతినిధులు ధనశేఖర్, ప్రకాశ్, ప్రమోద్, బీఆర్ఎస్ బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడు రాజు, నాయకులు శైలేందర్, జగదీష్, బాబురావు, భక్తులు పాల్గొన్నారు.